





లంకిరెడ్డి శివశంకర ప్రసాద్‌రెడ్డి

"ఒరేయ్ రామిగా! కాస్త ఈ చెప్పులు తుడవరా. నిన్న సాయంత్రం వర్షంలో స్కూలునుంచి ఇంటికి వస్తుంటే రోడ్ల మీద దుమ్మంతా వీటికి అంటుకొని ఎలా అయ్యాయో చూడు! తొందరగా తుడవాలి" అంటూ పండ్రెండు సంవత్సరాల రాజు అదే వయస్సులోవున్న తమ పాలేరును పిలిచాడు.

"అట్టాగే: బాబయ్యా!" అంటూ పావిట్లో ఎల్లావు జూలు దువ్వుతూ కూర్చున్న రామిగాడు గబగబా రాజు దగ్గరకు వచ్చాడు.

"ముందు వీటిని గుడ్డతో శుభ్రంచేసి తరువాత ఈ డబ్బాలోవున్న ఆయిల్ ని మెరుగు వచ్చేదాకా చెప్పులకు పూయాలి. తెలిసిందా ?" డబ్బా వాడిముందు పడేస్తూ అన్నాడు రాజు.

"తమరు నాకు సెప్పాలా బాబూ! నాకు తెలవదేమిటి? ఈటిని ప్రతిసారి నానే గందా బాగుసేసేది!" అంటూ చెప్పులను చేతిలోకి తీసుకున్నాడు రామిగాడు.

"నేను అన్నం తిని వచ్చేలోగా నీవు చెప్పులు తుడవాలి లేదా...." అంటూ రాజు కోపంగా చూశాడు.

"సిటికెలో తుడిసెయ్యాను. అదిగో అమ్మగారు కేకేత్తున్నారు. యెల్లండి బాబు!" రాజును ఉద్దేశిస్తూ అన్నాడు రామిగాడు.

రాజు హుషారుగా వచ్చీరాని పాటను పాడుకుంటూ లోనికి వెళ్ళాడు. రామిగాడు చెప్పుల్ని అదేపనిగా చూస్తున్నాడు. గుడ్డతో తుడిచి ఆయిల్ రాస్తే ఇంకా మెరుస్తాయి.

మెత్తనిచెప్పులు. అందమైన చెప్పులు. ఎర్రని చెప్పులు-మంచి చెప్పులు.

ఆ మెరుపు కళ్ళతో చూడాలని రామిగాడు గబగబా గుడ్డతో తుడిచి తరువాత డబ్బా తెరచి ఆయిల్ ఆ చెప్పులకు రాశాడు. ఇప్పుడు చెప్పులు ఎర్రగా మెరుస్తున్నాయి. రామిగాడి కళ్ళు కూడా అదే చెప్పుల్ని చూసి మెరుస్తున్నాయి.

రామిగాడి తాత రాజు తాత చెప్పులు తుడిచాడు. రాజు తండ్రి చెప్పులు రామిగాడి తండ్రి తుడిచాడు. ఇప్పుడు రాజు చెప్పులు రామిగాడు తుడుస్తున్నాడు. ఇది తరతరాలుగా జరుగుతూ వుంది.

చెప్పులు తుడిచినప్పుడల్లా రామిగాడికి ఒక్కగానొక్క కోరిక కలుగుతూ వుంటుంది. అదేమిటంటే తను తుడిచే చెప్పులటువంటివి తొడుక్కొని తన జీవితంలో ఒక్కసారైనా పట్టణం వెళ్ళాలని- రెండు మూడు సినిమాలు చూసి రావాలని.

కాని ఎలా తీరుతుంది వాడి కోర్కె?

ఒక్కొక్కప్పుడు రామిగాడికితనమీద, తనను కన్న తల్లిదండ్రులమీద, తనను పుట్టించాడనుకుంటున్న భగవంతునిమీద అసహ్యం, కోపంకూడా వస్తుంది.

తను చేయజాలని పెద్దపనేదైనా చేయాల్సినప్పుడు ఈ పని నేనెందుకు చేయాలా అన్న ఆలోచన వస్తుంది.

దొరసానెప్పుడైనా పాచిన అన్నము పెడితే అది తినేటప్పుడు మహా బాగాకోపం వస్తుంది.

ఇలాంటివి ఎన్నెన్నో రామిగాడి మనస్సులోనే దాచుకుంటున్నాడు- పాపం అంతకన్నా ఏం చేయగలడు.

ఇంతలో రాజు అన్నం తిని పుస్తకాల పంచిని తీసికొని ఎంచక్కా తను బాగు చేసిన చెప్పులు వేసుకొని వుషారుగా బడివైపు నడక సాగించాడు.

అలా వెడుతున్న రాజు వంక, రాజు తొడుక్కున్న చెప్పుల వంక స్థాణువులా రామిగాడు నోరు తెరచుకొని చూస్తూ వుండిపోయాడు. కాని ఆ రామిగాడిలో చలనం వస్తే....?

★

**VISAKHA COLLEGE OF ARTS & COMMERCE**
Aseelametta Jn. Visakhapatnam-3
Appear for B.A. B. Com (Ent) Exams of Andhra University
No Qualification is Required Age – 20 Years
**ORAL/POSTAL COACHING OFFERED**
For Prospectus & particulars send Rs. 3/-
*Principal.*